842) సాళంగనాట

ప|| అవధారు దేవ హరికుల రామ | వివిధమై నీబంటు వెలయుచున్నాడు ||

చ|| అదె కలశాపుర హనుమంత రాయడు | కదనము లోన రక్కసుల గొట్టి |
యెదుట నిందరి లోన నేకాంగవీరుడై | కొదలేక ప్రతాపించి కొలువైవున్నాడు ||

చ|| చల్లని వనాల నీడ సాగుడు కొండలలోన | వల్లెగా వేసుకొన్న వాలముతోడ |
పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని | కొల్లున మంటపములో కొలువై వున్నాడు ||

చ|| పెక్కు పండ్ల గొలలు పిడికిట బట్టుకొని | చక్కగా పెరిగి పెద్దజంగ చాచి |
యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైన సర్వేశ | గుక్కక నీపై భక్తి గొలువై విన్నాడు ||